క్లుప్తంగా

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణ మహోత్సవం

మర్రిపాడు (ఆత్మకూరురూరల్): మండలంలోని చుంచులూరు రామాలయంలో శనివారం రాత్రి సీతారాముల కల్యాణాన్ని విశేష పూజలు, అభిషేకాలతో వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన చింతంరెడ్డి సిద్దారెడ్డి, జయమ్మ దంపతుల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు నూతనంగా తయారు చేయించిన వెండి కిరీటాలు, నామాలు, యజ్ఞోపవీతం, అమ్మవారికి మాంగళ్యం తదితరాలు సమర్పించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సీతారాముల కల్యాణ వేడుకలను తిలకించారు.

ఆటో, బైక్ ఢీ.. వ్యక్తికి తీవ్రగాయాలు



కొండయ్యను తరలిస్తున్న 108 సిబ్బంది

కలిగిరి: ఆటో, బైక్ ను ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన కలిగిరి విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో శనివారం జరిగింది. మండలంలోని జిర్రావారిపాళెంకు చెందిన పాశం కొండయ్య, కుసుమ బైక్‌పై సిద్ధనకొండూరు వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామం బయలు దేరారు. వింజమూరు నుంచి వస్తున్న ఐస్‌క్రీం ఆటో బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కొండయ్యకు తీవ్రగాయాలు కాగా కుసుమకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను 108 వాహనంలో కలిగిరి పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం 108 వాహనంలో కావలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



విద్యార్థులకు సలహాలను ఇస్తున్న పంచాయతీ కార్యదర్శి

కొండాపురం: చిన్నతనం నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని గూడవళ్లూరు పంచాయతీ కార్యదర్శి పృథ్వీరాజ్ తెలిపారు. శనివారం స్థానిక గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరానికి హాజరై విద్యార్థులకు గ్రంథాలయ విశిష్టత గురించి వివరించారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయంలో లభించే పుస్తకాలను చదవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసమే ఈ వేసవి విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ అధికారి జె కొండయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన మాజీ జెడ్పీటీసీ దుగ్గిరెడ్డి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న దుగ్గిరెడ్డి గురవారెడ్డి

ఉదయగిరి: సీతారామపురం మాజీ జెడ్పీటీసీ దుగ్గిరెడ్డి గురవారెడ్డి శుక్రవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కావలి పర్యటన సందర్భంగా సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. మాజీమంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ సీఎంకు దుగ్గిరెడ్డిని పరిచయం చేశారు. ప్రస్తుత జిల్లా ఎస్పీ తిరుమలేష్‌రెడ్డికి మామ అని ఆయన్ను సీఎంకు మంత్రి పరిచయం చేశారు. ఉదయగిరిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని సూచించారు.

విస్తృతంగా ఉపాధి హామీపై ఆడిట్

చేజర్ల (సోమశిల): అనంతసాగరం మండలంలోని పాతాళ్లపల్లి, రేవూరు, వెంగంపల్లి గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం, ఉపాధి హామీ సిబ్బంది శనివారం సోషల్ ఆడిట్ గ్రామ సభలు నిర్వహించారు. డీఆర్పీలు గ్రామాల్లో విచారించిన వివరాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్పీలు కే బాలాజీ, కే హరేంద్ర, వై.కుమార్, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



బత్తిన షణ్ముఖకుమార్, కలిగిరి, కలిగిరి మండలం



దుగ్గిరాల రాధ, కళవళ్ల, ఉలవపాడు మండలం



పిడతల నాగరాజు,అన్నమయ్య జిల్లా

ఆర్తుల్లో ఆత్మవిశ్వాసం

- వారి దగ్గరికే వెళ్లి వేదనలు ఆలకించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- బాధితులు ఒక్కొక్కరికి అక్కడికక్కడే రూ.లక్ష సాయం
- సీఎం పర్యటన ముగిసేలోపే బాధితులకు చెక్కుల పంపిణీ

ఒక్కొక్కరిది ఒక్కొక్క వేదన. జన్యు లోపంతో ఎదుగుల లేని బిడ్డకు మెరుగైన వైద్యం చేయించాలని వేడుకోలు. రోడ్డు ప్రమాదంలో కాలుపోవడంతో దివ్యాంగుడైన దీనగాథ. వెన్నెముఖ ఆపరేషన్ కోసం సాయం చేయాలని వినతి. అరుదైన వ్యాధితో బాధపడుతున్న యువతి. భర్తకు కిడ్నీలు ఫెయిల్ అయ్యాయని వైద్యం చేయించాలని ఓ మహిళ కన్నీటి వేదన. బతుకు భారమై.. పోషణలేక.. ఆరోగ్యం సహకరించక ఇబ్బందులు పడుతున్నామని దివ్యాంగులు.. ఇలా వ్యథల గాథలు విన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలించిపోయారు. తక్షణ సాయం అందించి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపారు.

కావలి: ఆపద ఉందని ఆదుకోవాలని తన కోసం నిరీక్షించే ఆర్తుల కోసం పరుగు పరుగున వెళ్లి అక్కడికక్కడే సాయం అందించి కన్నీటి తుడచడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుంటారు. ఏ జిల్లాకు వెళ్లినా.. తమ కష్టాలు చెప్పుకునేందుకు వచ్చిన వారిని గమనించి వేగంగా వెళ్లే కాన్వాయ్‌ను సైతం ఆపి, స్వయంగా దిగివచ్చి కష్టాలు తీర్చిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. శుక్రవారం కావలికి వచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని పలువురు ఆర్తులు కలిసి తమ కన్నీటి వ్యథలను చెప్పుకున్నారు. ఆ ఆర్తులను అక్కన చేర్చుకుని సీఎం వైఎస్ జగన్ తన సహజ మానవత్వాన్ని చూపి ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. కావలి పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రిని కలిసేందుకు ఎదురుచూస్తున్న పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని ప్రత్యేకంగా హెలిపాడ్ ప్రాంగణంలోకి పిలిపించుకుని, వారి వద్దకు వెళ్లి సమస్యలను ఆలకించారు. ఏడుగురు ఆర్తులకు ఒక్కొక్కరికి రూ.లక్ష వంతున అందించి, అవసరమైన వైద్య సేవలు సత్వరమే అందించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను ఆదేశించారు. దీంతో కలెక్టర్ హరినారాయణన్ ప్రత్యేకంగా దివ్యాంగుల వద్దకు వెళ్లి వారికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని తానే స్వయంగా నమోదు చేసుకుని, ప్రభుత్వ పరంగా అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. దీంతో లింగసముద్రం మండలం మెడిసిముట్లపాళెం గ్రామానికి చెందిన మర్రిపూడి సుబ్బారావు, కలిగిరి మండలం కలిగిరికి చెందిన బత్తిన షణ్ముఖకుమార్, వెంకటాచల మండలం సర్వేపల్లికి చెందిన నోసం అమూల్య, కావలి మండలం చెంచుగానిపాళెంకు చెందిన పోసిన వెంకట్రావు, ఉలవపాడు మండలం కళవళ్లకు చెందిన దుగ్గిరాల రాధ, అన్నమయ్య జిల్లాకు చెందిన పిడతల నాగరాజు, తోటపల్లిగూడూరు మండలం పోట్లపాళెంకు చెందిన వెంకటఅనిల్ కుటుంబాల్లో సీఎం ఆత్మ విశ్వాసం నింపారని సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

సీఎం తాడేపల్లికి చేరుకునేలోగా..

తనను కలిసి వేదన చెప్పుకున్న ఆర్తులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓదార్చారు. నేనున్నానంటూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపారు. బాధితులకు సాయం అందించాలని ఆదేశించిన వెంటనే కలెక్టర్ హరినారాయణన్ చెక్కులను తయారు చేశారు. ముఖ్యమంత్రి కావలి పర్యటన ముగించుకుని తాడేపల్లికి చేరుకునేలోపే బాధితుల వద్దకు వెళ్లి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ హరినారాయణన్ తక్షణ సాయంగా అక్కడికక్కడే ఒక్కొక్కరికి రూ.లక్ష చెక్కులను అందజేశారు.



నోసం అమూల్య, సర్వేపల్లి



మర్రిపూడి సుబ్బారావు,మెడిసిముట్లపాళెం



పోసిన వెంకట్రావు, చెంచుగానిపాళెం

తుమ్మలపెంట రోడ్డు నిర్మాణ జాప్యంపై సీఎం సీరియస్

- 15 రోజుల్లో నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌కు ఆదేశం
- సీఎం వైఎస్ జగన్ సభను సక్సెస్ చేసిన ప్రజలకు ధన్యవాదాలు
- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: కావలి పట్టణం నుంచి తీర ప్రాంత గ్రామాలకు అనుసంధానం చేసే అత్యంత కీలకమైన తుమ్మలపెంట రోడ్డు నిర్మాణ పనులు జరగకపోవడంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీరియస్ అయ్యారని, 15 రోజుల్లోగా నివేదిక పంపాలని కలెక్టర్‌ను ఆదేశించారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కావలిలోని తన నివాసంలో శనివారం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. తుమ్మలపెంట రోడ్డు దుస్థితిపై ప్రజలు పడుతున్న ఇబ్బందులను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులు చేయకపోతే కాంట్రాక్ట్‌ను రద్దు చేసి, మరొకరితో పనులు చేయించాలి కదా అని కలెక్టర్‌ను సీఎం ప్రశ్నించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. డీఎం, డీఆర్ చానల్స్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సీఎంను కోరినట్లు చెప్పారు. కావలిలో అభివృద్ధి పనులకు రూ.150 కోట్లు నిధులు మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కావలిలో సీఎం వైఎస్ జగన్ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వచ్చి సభను విజయవంతం చేసినందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, తాళ్లూరు ప్రసాద్‌నాయుడు, జంపాని రాఘవులు గౌడ్, పందింటి కామరాజు, కుందుర్తి శ్రీనివాసులు, గంధం ప్రసన్నాంజనేయులు, కుందుర్తి కామయ్య, కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణా తరగతులు

చేజర్ల (సోమశిల): కొన్ని రోజుల నుంచి అనంతసాగరం గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు శనివారం కూడా కొనసాగాయి. విద్యార్థులతో కథలు చెప్పించడం, వ్యాయామాలు చేయించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ నారాయణరావు, వై.పెంచలసాయి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 202 కేసుల రాజీ



లోక్ అదాలత్‌లో పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి శోభ, జూనియర్ సివిల్ జడ్జి వరలక్ష్మి



ఉదయగిరి : లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి

కావలి: జాతీయ మెగా లోక్ అదాలత్‌ను పురస్కరించుకుని కావలిలోని కోర్టు ప్రాంగణంలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 202 సివిల్, క్రిమినల్ కేసులు రాజీపడి పరిష్కారమయ్యాయి. సివిల్ కేసుల్లో రూ.42,29,100 పరిహారం చెల్లించడాకి పరస్పర అంగీకారంతో కేసులు రాజీ అయ్యాయి. ఈ సందర్భంగా కావలి లోక్‌అదాలత్ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి శోభ, జూనియర్ సివిల్ జడ్జి వరలక్ష్మి మాట్లాడుతూ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కావలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఐవీ రామిరెడ్డి, మాజీ అధ్యక్షుడు కాటా సురేంద్రరెడ్డి, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఎంవీ సుబ్బానాయుడు, సీనియర్ న్యాయవాదులు ఎస్ఎక్స్ కెనడీ, లోక్ అదాలత్ సభ్యులు జాకీర్ హుస్సేన్, కట్టా రాము, సీనియర్ న్యాయవాది దేవరపల్లి వేణుగోపాల్‌రెడ్డి, ఏ జగన్‌మోహన్‌రావు, టి.మల్లికార్జునరావు, పీవీ రమణారెడ్డి, ఆర్.నాగేంద్రబాబు, పి.సునీల్‌కుమార్‌సింగ్, పి.శ్రీనివాసమూర్తి, అభిషేక్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎస్.రిషి కుమార్, శ్రీదేవి, లోక్ అదాలత్ సభ్యుడు ఎం.మాల కొండారెడ్డి, కోర్టు సిబ్బంది, కావలి స్టేట్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో పలు కేసుల పరిష్కారం

ఉదయగిరి: ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి డి.అంజయ్య ఆధ్వర్యంలో శనివారం కోర్టు ఆవరణలో మెగా లోక్‌అదాలత్ నిర్వహించారు. ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, వరికుంటపాడు, మర్రిపాడు, వింజమూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని 69 కేసులు పరిష్కరించారు. మరో 413 పెట్టీ కేసులు కూడా పరిష్కారమయ్యాయి. ఇందులో ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పలువురు పోలీస్ అధికారులు సీఐ గిరిబాబు, ఎస్సైలు ఎన్.ప్రభాకర్, విజయ్ శ్రీనివాస్, బాజిరెడ్డి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

కర్ణాటక విజయంపై కాంగ్రెస్ సంబరాలు

ఉదయగిరి: కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించడంతో శనివారం ఉదయగిరి పంచాయతీ బస్టాండ్‌లో ఆ పార్టీకి చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు సంబరాలు నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి దుద్దుకూరు రమేష్ బాణసంచా కాల్చి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్ణాటకలో కాంగ్రెస్ విజయం బీజేపీకి చెంప పెట్టు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల నాయకులు సత్తెనపల్లి బాలయ్య, చంద్రమౌళీశ్వరరెడ్డి, హజరత్తయ్య, బాబూరావు, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీని మళ్లీ అధికారంలోకి తేవాలి



ఆత్మీయ సమావేశంలో ఉదయగిరి నేతలతో ధనుంజయరెడ్డి

దుత్తలూరు: వైఎస్సార్‌సీపీని మళ్లీ అధికారంలోకి తెచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి అన్నారు. శనివారం ఆయన దుత్తలూరులో మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు మరింత మేలు జరగాలంటే 2024లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అధికారంలోకి తీసుకురావాలన్నారు. అందుకోసం ఇప్పటి నుంచే నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. వివిధ గ్రామాల నుంచి హాజరైన ముఖ్య నేతలు, కార్యకర్తలు వారి అభిప్రాయాలను తెలియజేశారు. నియోజకవర్గానికి ధనుంజయరెడ్డి వంటి నాయకుడు అవసరమని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ చేజర్ల చలమారెడ్డి, నందిపాడు సొసైటీ అధ్యక్షుడు ఉండేల గురవారెడ్డి, మండల కన్వీనరు వాసిపల్లి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు మీసాల సుబ్బరాయుడు, తిప్పిరిబోయిన పెదవెంగయ్య, అంకినపల్లి రమేష్‌రెడ్డి, నాయకులు సింగవరపు వెంకటేశ్వరరెడ్డి, రోశిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, తుమ్మల వెంగయ్య, దయాకర్‌రెడ్డి, అల్లూరురాజు, అంకినపల్లి ఓబుల్‌రెడ్డి, బంకా ప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి, వెంగళరెడ్డి, మీరావలి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యాకానుక

- ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్



బసినేనిపల్లి హైస్కూల్‌లో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ప్రవీణ్‌ప్రకాష్

సీతారామపురం: జగనన్న విద్యాకానుక కిట్‌లు విద్యార్థులకు పంపిణీ చేసేటప్పుడు నాణ్యతగా ఉన్నవే పంపిణీ చేయాలని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ అన్నారు. ఆయన శనివారం సీతారామపురంలోని ఆదర్శ పాఠశాల, బసినేనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. యూనిఫాం, బ్యాగు లు, నోటు పుస్తకాలు, బెల్ట్‌లు, షూస్ తదితర వస్తువులను పరిశీలించారు. జగనన్న విద్యాకిట్‌లో కొన్ని బ్యాగులకు జిప్‌లు సరిగా లేకపోవడం, బెల్టు సైజులు తగ్గి ఉండడం, యూనిఫాం కొలతలు పరిశీలించి కిట్‌లు అందిస్తున్న వారికి ఫోన్ చేసి అసంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యమైన వస్తువులనే పాఠశాలలకు అందించాలని, మిగిలినవి వాపసు తీసుకోవాలన్నారు. బసినేనిపల్లి హైస్కూల్‌లో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేలా పనులు నిర్మించాలన్నారు. బాత్‌రూం టైల్స్ పరిశీలించి కొలతలు చూశారు.

ఇంగ్లిషు టీచర్‌కు అభినందనలు

బసినేనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలువురు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారికి విద్య పట్ల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. వారి పుస్తకాలు పరిశీలించారు. వారి హోంవర్క్ బుక్‌ల్లో ఇంగ్లిష్‌లో విద్యార్థులు బాగా అభ్యసించే విధంగా చర్యలు తీసుకున్నారని టీచర్ సిద్దిక్‌కు ఫోన్ చేసి అభినందించారు. ఆయన వెంట జిల్లా విద్యాశాఖాధికారి గంగాభవాని, ఆర్‌జేడీ సుబ్బారావు, ఏపీసీ ఉషారాణి, ఎంఈఓ మస్తాన్‌వలి, ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ప్రవీణ్‌ప్రకాష్ సుడిగాలి పర్యటన

ఉదయగిరి: పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ప్రవీణ్‌ప్రకాష్ శనివారం ఉదయగిరి నియోజకవర్గంలోని పలు మండలాల్లో సుడిగాలి పర్యటన చేసి పలు పాఠశాలల్లో నాడు-నేడు పనులను, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు. ఉదయగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గడ్డంవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



సీతారామపురం రోడ్డు మార్గంలో ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగిస్తున్న దృశ్యం

ఉదయగిరి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి ఉదయగిరి రేంజ్ అధికారి తుమ్మల ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ముందుగా లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ అనే నినాదంతో పరిశుభ్రతకు చర్యలు చేపట్టారు. ఉదయగిరి బీసీ కాలనీ, దుర్గం, సీతారామపురం రోడ్డు మార్గాల్లో వాకర్స్, అటవీశాఖ సిబ్బంది, స్థానికులతో కలిసి పర్యావరణాన్ని హాని కలిగించే ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించి డంపింగ్ యార్డుకు తరలించారు. రేంజర్ మాట్లాడుతూ ప్రజల మనుగడ పర్యావరణ పరిరక్షణపై ఆధారపడి ఉందని, భవిష్యత్ తరాలు సుఖంగా జీవించాలంటే పర్యావరణ రక్షణపై అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమం ప్రపంచ పర్యావరణ దినోత్సవం జూన్ 5వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో శ్రీనివాసులు, అటవీశాఖ సిబ్బంది భోగ్యం శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

రైతు భరోసా లబ్ధిదారుల జాబితా ప్రదర్శన

చేజర్ల: వైఎస్సార్ రైతు భరోసా 2023-24 లబ్ధిదారుల జాబితా, అనర్హుల జాబితా రైతుభరోసా కేంద్రాల్లో ప్రదర్శించినట్లు చేజర్ల ఏఓ శశిధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులై ఉండి అనర్హుల జాబితాలో ఉన్నవారెవరైనా ఉంటే ఈ నెల 18వ తేదీలోగా నమోదు చేసుకోవడానికి అవకాశముందని తెలిపారు. రైతులు ఆర్బీకేల్లోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు.

హనుమజ్జయంతికి ఏర్పాట్లు పూర్తి



కావలి: ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి



కలిగిరి: పోలీస్‌స్టేషన్ ఆవరణలోని ఆంజనేయస్వామి ఆలయం



కాకివాయిలోని అభయ ఆంజనేయ స్వామి దేవాలయం



సంగం: ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

కావలి: పట్టణంలోని మద్దూరుపాడులో ఉన్న వీరాంజనేయస్వామి ఆలయంలో హనుమత్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు దీవి రమేషాచార్యుల, పోతుగంటి శ్రీధర్, గుత్తికొండ కిషోర్‌బాబు, మట్టా వెంకట శివ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం హనుమత్ జయంతిని పురస్కరించుకుని ఉదయం 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన సంతర్పణ జరుగుతుందని చెప్పారు. సాయంత్రం 6 గంటలకు సుదర్శన హోమం, సోమవారం సాయంత్రం 6 గంటలకు సీతారామ కల్యాణం, రాత్రి 9 గంటలకు వీరాంజనేయస్వామి గ్రామోత్సవ జరుగుతందని వివరించారు.

కలిగిరి: మండలంలో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కలిగిరిలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆంజనేయస్వామి ఆలయంతో పాటు ఎంపీడీఓ కార్యాలయం, జిర్రావారిపాళెం, కమ్మవారిపాళెంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలను అట్టహాసంగా జరుపుతారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భక్తులు హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొనాలని కోరారు.



ఆత్మకూరు: అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద హనుమజ్జయంతి ఏర్పాట్లు చేస్తున్నట్లు దృశ్యం

ఆంజనేయస్వామి ఆలయాల ముస్తాబు

చేజర్ల: ఆదివారం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. చేజర్ల, కాకివాయి, నాగులవెలటూరుల్లో వైభవంగా హనుమజ్జయంతిని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాకివాయిలో ఇటీవల నిర్మించిన హనుమంతుడి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నారు. కాకివాయిలో రోడ్డును ఆనుకుని అభయ ఆంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించారు. సుమారు 13 అడుగుల విగ్రహం, అక్కడే దేవాలయాన్ని నిర్మించారు.

హనుమాన్ జయంతి వేడుకలు ప్రారంభం

సంగం: మండలంలో హనుమాన్ జయంతి వేడుకలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. సంగంతో పాట సిద్దీపురం గాంధీజనసంఘం తదితర ప్రాంతాల్లోని ఆంజనేయస్వామి ఆలయాలు హనుమాన్ జయంతి పురస్కరించుకుని అభిషేకం, ఆకుపూజా కార్యక్రమాలు నిర్వహించారు. తదుపరి ఆంజనేయ స్వామిలను విశేష పూలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.

హనుమజ్జయంతికి ముమ్మర ఏర్పాట్లు

ఆత్మకూరు: ఆత్మకూరు బైపాస్ రోడ్డులో కొలువైన అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమంతుడి జన్మదినం (హనుమజ్జయంతి) పురస్కరించుకుని ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం హనుమజ్జయంతి కావడంతో ఆలయంలో ప్రత్యేక పూజలు, విశేష ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. వేకువజామున స్వామి వారి గర్భగుడిలోని మూలవిరాట్‌కు పాలు, పంచదార, తేనె, వివిధ రకాల ఫలాలు, పెరుగు, పన్నీరు తదితర విశేష ద్రవ్యాలతో స్వామివారి అభిషేకం నిర్వహించనున్నట్లు అనంతరం తమలపాకులతో సహస్రనామ పూజలు చేయనున్నట్లు తెలిపారు. పట్టణంలోని పంటవీధి రామాలయంలోని అభయాంజనేయస్వామి ఆలయం వరకు ఇరుముడులు ధరించి దీక్ష చేపట్టిన భక్తులు శోభాయాత్రను నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, సువర్చలాదేవి సమేత అభయాంజనేయస్వామి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం భారీ స్థాయిలో అన్నప్రసాద వితరణ చేయనున్నారు. సాయంత్రం 60 అడుగుల భారీ అభయాంజనేయస్వామి వారి విగ్రహానికి ప్రత్యేక ఏర్పాట్లతో పాలాభిషేకం చేయనున్నట్లు, రాత్రి పల్లకి సేవ నిర్వహించనున్నట్లు వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పలువురు భక్తులతో పండరీ భజన, రాత్రి 10 నుంచి తెల్లవారుజాము 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు తదుపరి అగ్నిగుండ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధికంగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.